

మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్

కూకట్‌పల్లిలో ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో గూడులేని పేదలను గుర్తించేందుకు ఇందిరమ్మ కమిటీని ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆంజనేయనగర్‌లోని పార్టీ కార్యాలయంలో 35 మందితో ఇందిరమ్మ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హులైన పేదలను గుర్తించి వారి సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ కమిటీలు పని చేస్తాయన్నారు. త్వరలోనే డివిజన్ల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ బలోపేతం కోసం పనిచేస్తున్న వారందరికి పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ- బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో రాజీపడం

- కూకట్‌పల్లిలో నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- కబీర్‌నగర్ నాలాపై స్లాబ్ ఏర్పాటు చేయండి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజల కనీస అవసరాలైన మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేటలో మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్‌తో కలిసి మూసాపేటలోని మైసమ్మ చెరువుతో పాటు పలు ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. చెరువు వద్ద నాలా నిర్మాణం చేసే సమయంలో రిటర్నింగ్ వాల్ ఎత్తు పెంచి బ్రిడ్జి నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం వార్డు కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మూసాపేట డివిజన్‌కు చెందిన కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో లక్షల గ్యాలన్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకులను గతంలోనే నిర్మించామని, ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కబీర్ నగర్ నాలా పనులు పూర్తిచేసి దానిపై స్లాబ్ నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బాలాజీ స్వర్ణపురి కాలనీలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఎవరూ ప్రవర్తించిన ఊరుకునేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. వీధి దీపాల సమస్యను కూడా పరిష్కరించాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్న తనకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అంబటి అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

20 వరకు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం 32వ వార్షికోత్సవానికి ముస్తాబైంది. నేటి నుంచి ఈ నెల 20వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని వారు తెలిపారు.



నివాళి

అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కాంగ్రెస్ యూత్ నాయకుడు మోయిజ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, యువకులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. - కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

బీసీ కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి

తెలంగాణలో బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాల వారిని తిరిగి బీసీల్లో చేర్చాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు కూకట్‌పల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జి ప్రేమకుమార్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. - కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి



నేడు ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి సూచికగా శనివారం కేపీహెచ్‌బీలోని రమ్యాగ్రౌండ్‌లో పండ్ల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు అడ్వకేట్ గుడివాక వాసుదేవుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం పది వేల పండ్ల మొక్కలను పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని వాసుదేవుడు తెలిపారు. రక్తదాన శిబిరంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 23, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, కాకరకాయ 38, బీరకాయ 38, క్యాబేజీ 15, బీన్స్ 55, క్యారెట్ 35, గోబిపువ్వు 28, దొండకాయ 18, చిక్కుడు కాయ 45, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 33, క్యాప్సికం 55, ఆలుగడ్డ 24, కీర 18, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 23, కంద 45, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 24, మామిడికాయ 15-20, అరటికాయ 8-10, చామగడ్డ 33, ముల్లంగి 4-5, చిలగడదుంప 26, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 30-40, మునగకాయలు 5-6, పచ్చిబఠాణీ 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 75, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 55, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు శనివారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

హబీబ్‌నగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బాబురావు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ హబీబ్‌నగర్‌లో జరుగుతున్న స్టార్మ్ అండ్ డ్రైన్ వాటర్ పనులను మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. మాజీ కార్పొరేటర్ వెంట కాలనీ అధ్యక్షుడు యాదుల్, ఖదీర్, ఫయాజ్, ఖాజా తదితరులు ఉన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడికి శుభాకాంక్షలు

హైదర్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్‌ను ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నాగరాజు శుక్రవారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని నాగరాజు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు జగన్, పాషా, యాదగిరి, రమేశ్‌పాటిల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో యువతి అదృశ్యం

హైదర్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న యువతి తిరుపతి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి అదృశ్యమైంది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ ఫేజ్-1లోని ఓ ప్రైవేట్ పీజీ హాస్టల్‌లో దీపిక నివాసం ఉంటోంది. కాగా ఈ నెల 12న తాను తిరుపతికి వెళ్తున్నట్లు హాస్టల్ వంట మనిషికి చెప్పి వెళ్లింది. ఆమె కుటుంబ సభ్యులు అదే రోజు మధ్యాహ్నం ఆమెతో మాట్లాడారు. అనంతరం ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.



దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ అధికారులు

దోమల నివారణ చర్యలపై అవగాహన

హైదర్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోన్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు, ఏఈ తేజశ్రీ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శుక్రవారం ఇంటింటికి వెళ్లి దోమల నివారణపై అవగాహన కల్పించారు. జలవాయు విహార్ కాలనీలో పర్యటించి దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల గురించి వివరించారు. యాంటీ ల్వారా ఆపరేషన్ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. నీటి నిల్వలు ఉన్న పాత్రలపై ఎప్పుడూ మూతలు ఉంచాలని సూచించారు. దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడువాపు తదితర వ్యాధులు వస్తాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

రోడ్డు పనుల్లో జాప్యంపై నేడు ధర్నా

చందానగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చందానగర్ నుంచి అమీన్‌పూర్ కమాన్ వరకు వెళ్లే శ్రీదేవి థియేటర్ రోడ్డు నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయని, ఏడేళ్ల క్రితం ప్రారంభమైన పనులు నేటికీ పూర్తికాలేదని బీజేపీ నాయకుడు బుచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో అమీన్‌పూర్ కమాన్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.



నివాళులర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

విమాన ప్రమాద మృతులకు నివాళి

గచ్చిబౌలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ప్రార్థించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

ద్విచక్రవాహనం చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

మియాపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మదీనగూడలోని ఓ షోరూంలో నక్క కిషోర్‌కుమార్(31) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన ఉదయం 5.45గంటలకు షోరూంలో విద్యుత్ సరఫరా ఆపేసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ దొంగిలించాడు. దీనిపై షోరూం మేనేజర్ కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కిషోర్‌కుమార్‌పై అనుమానం వచ్చి విచారణ చేయగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అధ్వానంగా రహదారులు

చందానగర్/ మియాపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు రహదారులు గుంతల మాయంగా మారాయి. పలు కాలనీల అంతర్గత రహదారులతో పాటు ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. చందానగర్ నుంచి అమీన్‌పూర్ వరకు వెళ్లే శ్రీదేవి థియేటర్ రోడ్డులో గుంతలతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీప్తిశ్రీనగర్ నుంచి రేగులకుంట వరకు గల రహదారి, జాతీయ రహదారి నుంచి ఎంఏనగర్ వరకు, పీజేఆర్ కాలనీ వరకు, బెల్ చౌరస్తా నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జ్ వరకు, తారానగర్ పోచమ్మ దేవాలయం నుంచి చందానగర్ పీజేఆర్ స్టేడియం వరకు వెళ్లే రహదారులతో పాటు పలు కాలనీల రోడ్లు గుంతల మాయంగా మారాయి. అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంఏనగర్‌లో గుంతలమయంగా మారిన రోడ్డు



శ్రీదేవి థియేటర్ రోడ్డులో..

ప్రాథమిక పాఠశాలల్లో అక్షరాభ్యాసం

గచ్చిబౌలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం కొత్తగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కొండాపూర్, మసీదుబండ, కొత్తగూడ, అంజయ్యనగర్, సిద్దిక్‌నగర్, లింగంపల్లి తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మసీదు బండ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

రాయదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): భారతదేశం ప్రజాస్వామిక దేశమని, ప్రజలు ఎన్నుకున్న నాయకులకే భారత రాజ్యాంగం పట్టంకట్టిందని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల డైరెక్టర్ రామేశ్వరరావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులు చురుకుగా ఉంటేనే అవి విజయవంతవుతాయని ఆయన పేర్కొన్నారు. టౌన్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై నిర్వహించే రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలో ఎస్కీలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో 543 మంది పార్లమెంట్ సభ్యులు, 4 వేలకు పైగా ఎమ్మెల్యేలు, సుమారు రెండున్నర లక్షల మంది గ్రామ సర్పంచులు, జిల్లా పరిషత్, మున్సిపల్ చైర్మన్‌లు, కౌన్సిల్ సభ్యులు, వార్డు మెంబర్లు ఉన్నారని.. సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా వారంతా కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఘన వ్యర్థాలు తగ్గించడం, తిరస్కరించడం, తిరిగి వాడే విధానం, తిరిగి ప్రయోజనం పొందడం వంటి విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా రామ్‌దుర్గ్ టౌన్ మున్సిపల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

చందానగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సుమారు 35 సంవత్సరాల వయస్సు గత వ్యక్తి లింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద అనారోగ్యంతో బాధపడుతుండగా రెండు రోజుల క్రితం పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడు భిక్షాటన చేస్తుంటాడని స్థానికులు తెలిపారు.

కేపీహెచ్‌బీలో యువతి అదృశ్యం

హైదర్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న యువతి తిరుపతి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి అదృశ్యమైంది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ ఫేజ్-1లోని ఓ ప్రైవేట్ పీజీ హాస్టల్‌లో నివసించే దీపిక ఈ నెల 12వ తేదీన తాను తిరుపతికి వెళ్తున్నట్లు వంట మనిషికి చెప్పి వెళ్లింది. ఆమె కుటుంబ సభ్యులు అదే రోజు మధ్యాహ్నం ఆమెతో మాట్లాడారు. అనంతరం ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బొటానికల్ గార్డెన్‌లో నేడు నేచర్ క్యాంప్

రాయదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఫారెస్ట్ ట్రెక్ పార్కులో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం 9.30 గంటల వరకు నేచర్ క్యాంపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్యాంపులో టీం బిల్డింగ్, టెంట్ పిచింగ్, రాత్రిపూట అడవిలో నడక, నైట్ క్యాంపింగ్, క్యాంప్ ఫైర్, ఉదయం బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ వంటి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ క్యాంపులో పాల్గొనే వారికి సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 9885298980, 9493549399 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

డ్రైనేజీ పనుల పరిశీలన

హైదర్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ మహంకాళినగర్, నాగమ్మనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, కాసాని శంకర్, దాతి రమేష్, వెంకట్రావు, రవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గాంధీ పూజలు

మియాపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ సుభాష్‌చంద్రబోస్ నగర్‌లోని పోచమ్మ ఆలయ 14వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, సాంబశివరావు, బృందరావు, సత్యం, అక్కరావు, రాములుయాదవ్, నర్సింహ, వెంకటేష్, ముక్తార్, వెంకటేష్, హరికృష్ణ ఉన్నారు.

విమాన ప్రమాద ఘటన కలచివేసింది

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన తనను కలచివేసిందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో మెడికోలు సైతం మరణించడం తీవ్ర విచారకరమన్నారు.

కాలువలో పేరుకుపోయిన చెత్త

మియాపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రేగులకుంట చెరువు కాలువలో చెత్తాచెదారం నిండిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీటితో పాటు చెత్తాచెదారం కొట్టుకువచ్చింది. దీంతో నీరు సాఫీగా వెళ్లడం లేదు. పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



కబ్జా స్థలం వద్ద ఆందోళన చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

ఇందిరాగౌడ్ భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలి

మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

జీడిమెట్ల, జూన్13 (ఆంధ్రజ్యోతి): కులసంఘం ముసుగులో కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి విక్రయిస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు ఇందిరాగౌడ్‌పై చర్యలు తీసుకొని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని జగద్గిరి గుట్ట డివిజన్ మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ధర్నాకు దిగారు. జగద్గిరగుట్ట వేంకటేశ్వస్వామి ఆలయ సమీపంలో ఇందిరాగౌడ్ గత ప్రభు త్వ హయాంలో దాదాపు 4 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి కాంపౌం డ్‌వాల్ నిర్మించి, అందులో గదులు కట్టి విక్రయిస్తుందని మహిళలు ఆరోపించారు. సర్వేనెంబర్ 348/1లో ప్రభుత్వ భూమిని కబ్జాచేసినా రెవెన్యూ యంత్రాంగం, హైడ్రా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. కబ్జా స్థలం వద్ద మహిళలు ధర్నాకు దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ ఇందిరాగౌడ్‌పై కేసునమోదు చేశారు. కబ్జా స్థలాన్ని వెంటనే రక్షించక పోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని బాలబోయిన లలిత, కౌసల్య హెచ్చరించారు.

ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడి భార్య ఆత్మహత్య



రూప (ఫైల్)

గాజులరామారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ వ్యక్తిగత సహాయకుడి భార్య ఆత్మహత్యకు పాల్పడింది. సూరారం సీఐ భరత్‌కుమార్ వివరాల ప్రకారం.. సూరారం ప్రియాంక నగర్‌లో నివాసం ఉండే జలంధర్‌రెడ్డి భార్య రూప (35) ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. అయితే రూప పెళ్లి సమయంలో వరకట్నం కింద ఆమె తల్లి దండ్రులు రెండెకరాల భూమి ఇచ్చారు. రెండు నెలల క్రితమే రూప తండ్రి చనిపోయాడు. తల్లి సత్తెమ్మ, అక్క చంద్రకళ భూమి వెనక్కి ఇవ్వమని ఒత్తిడి తీసుకు వచ్చారు. అయితే వారి వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం తానుంటున్న గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చని పోయింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బాక్సింగ్‌లో సత్తాచాటిన కృష్ణ కిశోర్



కొలన్ శ్రీనివాస్‌రెడ్డితో కృష్ణ కిశోర్, తల్లి దండ్రులు

నిజాంపేట్, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీలో ఉండే దస్తగిరి దంపతుల కుమారుడు కృష్ణ కిశోర్ గోల్డ్ మెడల్ సాధించారు. అనంతరం నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని తల్లి దండ్రులతో కలిసి ఆయన కార్యాలయంలో కలిశారు.



మన ఊరు- మనబడి కార్యక్రమంలో రంగారెడ్డినగర్ డివిజన్ గురుమూర్తినగర్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

- పేట్‌బషీరాబాద్, (ఆంధ్రజ్యోతి)

ఇందిరమ్మ ఇళ్లకు స్థలాల అన్వేషణ

- జీ+2 నిర్మాణాలకోసం అధికారుల ప్రణాళికలు
- ప్లాట్లను ఇచ్చేందుకు ససేమిరా అంటున్న జనం

కుత్బుల్లాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు నానా కష్టాలు పడుతున్నట్లు తెలుస్తోంది. గాజులరామారం సర్కిల్ పరిధిలో గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, సూరారం డివిజన్‌లుండగా 108 కాలనీలు, బస్తీలున్నాయి. వీటిలో 38 బలహీన వర్గాల కాలనీలున్నాయి. ప్రభుత్వం ఇండ్లులేని నిరుపేదల కోసం గతంలోనే దరఖాస్తులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే నాలుగు డివిజన్‌లలో మొత్తం ఇందిరమ్మ ఇళ్ల కోసం 53 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా, జిల్లాల్లో స్థలాలున్నవారికి రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించి అర్హులను ఎంపిక చేసింది. అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం ఏదైనా స్థలాలను వెతికి జీ+2 నిర్మించి అర్హులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో 53 వేల దరఖాస్తులు రాగా విచారణ చేసిన అనంతరం అర్హులను గుర్తించే పనిని ఉన్నతాధికారులకు అందజేశారు. అర్హుల ఎంపిక పూర్తికాకముందే వారికి ఇండ్లకోసం స్థలాలను వెతికేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో పలానా ప్రాంతంలో ఇంత స్థలం ఉందనే స్పష్టమైన సమాచారం లేకపోవడంతో ఏదైనా బస్తీని ఎంపిక చేసి గతంలో పట్టాలు పొందిన వారిని ఒప్పించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా గాజులరామారం డివిజన్ పరిధిలోని బాలయ్యనగర్, సూరారం డివిజన్ పరిధిలోని సోనియాగాంధీనగర్ బస్తీలను ఎంపిక చేద్దామని పరిశీలించారు. అయితే కొందరు తమ తమ ప్లాట్లలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోగా కొందరు రేకుల గదుల్లోనే ఉం టున్నారు. రేకుల గదులున్న వారు స్థలమిచ్చి ఒక పోర్షన్ తీసుకునేందుకు ఒప్పుకుంటుండగా స్థిర నివాసం ఉన్న వారు మాత్రం ఒప్పుకోవడంలేదు. సోనియాగాంధీనగర్‌లో 600కు పైగా నివాసాలుండగా 5 శాతం వరకు స్థిర నివాసాలుండగా మిగతా వారందరికి రేకులగదులే ఉన్నాయి. ఇందులో 100 మందికి పైగా గత ప్రభుత్వాలు జారీ చేసిన పట్టాలుండగా మిగతా వారికి నోటరీలు మాత్రమే ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

స్థల యజమానికి ముందే కేటాయిస్తాం

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా స్థలాలున్న వారు మాకు అప్పగిస్తే ముందుగానే కేటాయించి పట్టాను అందజేస్తాం. నిర్మాణం పూర్తయ్యే వరకు మరో చోట ఉండాల్సి ఉంటుంది. జీ+2లో ఒక పోర్షన్‌ను స్థల యజమానికి ముందుగానే ఇవ్వడం జరుగుతుంది. అయితే కొందరు స్థలాలను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ప్రజలు సహకరిస్తే ప్రభుత్వ పరంగా అన్ని రకాల మౌలిక వసతులు మెండుగా కల్పిస్తాం. ప్రజలు తమ ఇంటి స్థలాలను ఇచ్చేందుకు సహకరించాలి. ముందుకు వచ్చిన ప్రాంతాలు భవిష్యత్‌లో మరింత అభివృద్ధి జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. **- మల్లారెడ్డి, గాజులరామారం సర్కిల్ డీసీ**





ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు పరిశీలించిన సోనియాగాంధీనగర్ కాలనీ

సాంఘిక సంక్షేమ హాస్టళ్లను వినియోగించుకోండి : కేపీ



అధ్యాపకులతో కలిసి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నిజాంపేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహిళ విద్య.. దేశాభివృద్ధికి తోడ్పాటును అందిస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట (శామీర్‌పేట) కాలేజీ 2025-26 సంవత్సరానికి ప్రవేశాల కోసం కాలేజీ లెక్చరర్స్‌తో కలిసి ఆయన ఎమ్మెల్యే నివాసంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల విద్యార్థినులు సాంఘిక సంక్షేమ హాస్టల్లో ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఇష్రత్ మాట్లాడుతూ కళాశాలలో బీఎస్సీ, బీజడ్సీ, ఎంజడ్సీ, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్‌సీఎస్, ఏఐఎంఎల్, బీకామ్ కంప్యూటర్, బీఏ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని, ఇంటర్ పూర్తయిన విద్యార్థినులు ఈ కోర్సులకు అర్హులన్నారు. ఈనెల 23 లోపు పదోతరగతి, ఇంటర్ మార్కుల మెమో లు, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లకు పట్టణ ప్రాంతం వారయితే రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతం వారయితే రూ.2.5 లక్షలు మించకుండా ఆదాయ ధృవ పత్రం, ఆధార్‌కార్డు, ఇంటర్ టీసీ, 8 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కళాశాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. సమాచారం కోసం 9640373202, 8309042565, 9666762726, 6301211683 నెంబర్లుకు ఫోన్ చేయాలని తెలిపారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న విద్యాధికారి, సీఐ, హెచ్‌ఎంలు

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

షాపూర్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గాజులరామారం మెట్‌కానీగూడ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్ఎం సబిత, మండల విద్యాధికారి జెమినీకుమారి, జీడిమెట్ల సీఐ మల్లేశం హాజరయ్యారు.



జర్నలిస్టు కాలనీలో తడి, పొడి చెత్తపై మున్సిపల్ అధికారుల ర్యాలీ

పర్యావరణాన్ని కాపాడుదాం

నిజాంపేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'చెత్తను నిర్మూలిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పలు డివిజన్లలో అవగాహన కల్పించారు. 100 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ జర్నలిస్టు కాలనీలో జర్నలిస్టులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఇంటికి మూడు రంగుల బుట్టలను అందించారు.



రైతు సదస్సులో రాజేందర్‌నగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త శ్రీలత

మల్లంపేటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

దుండిగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో దుండిగల్ మండలం, మల్లంపేట గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేందర్‌నగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్. శ్రీలత పాల్గొన్నారు. అనంతరం ఆమె రైతులకు ఆరు ముఖ్యమైన అంశాలను వివరించారు. పొలాల్లో తక్కువ, ఎక్కువ యూరియా వాడకం వల్ల జరిగే భూ జలాల కాలుష్యం, పర్యావరణ కాలుష్యంపై వివరించారు. వీటితో పాటు రసాయన ఎరువులను తగ్గించి, వాటికి బదులుగా పచ్చి రొట్ట ఎరువులు, జీలుగ, జనుము వేసుకొని, సేంద్రీయ ఎరువుల వాడకం, జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి యాదగిరి, మహిళా రైతులు, రాజేందర్‌నగర్ పీహెచ్‌డీ విద్యార్థి కావ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు, నోట్‌బుక్స్ పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి

దుండిగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే అనుకున్నది సాధించవచ్చునని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డీ పోచంపల్లి గ్రామంలో పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి దుస్తులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం 8 మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.